# సాక్షి సూర్యాపేట

శనివారం । 11 । మే । 2024






**అంతరాయం కలగొద్దు**

ఎన్నికల ప్రక్రియలో విద్యుత్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ సీజీఎం చక్రపాణి సూచించారు. - 2లో



**కాంగ్రెస్ గెలుపు.. అవసరం**

దేశంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు చాలా అవసరమని ఉమ్మడి ఏపీ ప్రధాన సమాచార మాజీ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. - 2లో

గరిష్టం / కనిష్టం

38° / 28°

**వాతావరణం**

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### 'కార్పొరేట్'లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

భానుపురి (సూర్యాపేట): 2024–25 విద్యా సంవత్సరంలో కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాల కోసం గిరిజన విద్యార్థిని, విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె.శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ గిరిజన వసతిగృహం/ ఆశ్రమ పాఠశాలలో వసతి పొంది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించిన గిరిజన విద్యార్థులు, కేజీబీవీ, ప్రభుత్వ, ఎయిడెడ్, మున్సిపల్, జిల్లా పరిషత్, ప్రభుత్వ రెసిడెన్షియల్, జనహర్ నవోదయ విద్యాలయం, బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో విద్యనభ్యసించి 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో 7.0 జీపీఏ నుంచి 10 జీపీఏ సాధించిన వారికి కార్పొరేట్ కళాశాలలో ఉచితంగా ప్రవేశం కల్పించనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు telanganaepass.gov.in ఆన్‌లైన్ ద్వారా ఈనెల 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వార్షిక ఆదాయం రూ.2లక్షలకు మించని కుటుంబాలకు చెందిన విద్యార్థులు అర్హులని తెలిపారు.

### ప్రత్యేక ప్రణాళికతోనే ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న డీఈఓ అశోక్

కోదాడ: జిల్లా యంత్రాంగం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి పకడ్బందీగా అమలు చేయడం తోనే జిల్లాలో ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించామని జిల్లా విద్యా శాఖ అధికారి (డీఈఓ) అశోక్ అన్నారు. శుక్రవారం కోదాడలోని కేటీఎస్ పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించిన పాఠశాలల యాజమాన్యాలు, 10 జీపీఏ సాధించిన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో వచ్చే విద్యాసంవత్సరం సూర్యాపేట జిల్లాను పది ఫలితాల్లో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలన్నారు. అనంతరం 10 జీపీఏ సాధించిన 161 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సలీం షరీఫ్, శ్రీనయ్య, శ్రావణ్, జనార్దన్, ప్రతాప్, చత్రునాయక్, బాణాల కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అక్షయ తృతీయ సందడి



సూర్యాపేటలో బంగారు నగలు కొనుగోలు చేస్తున్న మహిళలు

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట పట్టణంలో అక్షయ తృతీయ సందడి నెలకొంది. ఈ రోజున బంగారాన్ని కొనుగోలు చేస్తే అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయని ప్రజల నమ్మకం. ఈ నేపథ్యంలో శుక్రవారం అక్షయ తృతీయ సందర్భంగా పట్టణంలోని అలంకార్ రోడ్డులోని బంగారం దుకాణాల్లో వివిధ వర్గాల ప్రజలు బంగారు నగలు కొనుగోలు చేశారు. దీంతో దుకాణాల్లో సందడి నెలకొంది. గురువారం పది గ్రాముల కేడీఎం బంగారం ధర రూ.67వేలు, బిస్కట్ బంగారం రూ.73,500లు ఉండగా శుక్రవారం అక్షయ తృతీయ సందర్భంగా రూ.1,500ల వరకు పెరిగి కేడీఎం రూ.68,500, బిస్కట్ రూ.75,300లకు చేరుకుంది.

### మట్టపల్లిలో వైభవంగా పూర్ణాహుతి



హోమం నిర్వహిస్తున్న యాజ్ఞికులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గల టీటీడీ కల్యాణ మండపంలో హైదరాబాద్‌కు చెందిన సుధీర్‌శర్మ ఆధ్వర్యంలో కొనసాగుతున్న హోమ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం యాజ్ఞికులు, అర్చకులు, రుత్విక్కులు వైభవంగా పూర్ణాహుతి గావించారు. అదేవిధంగా భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అర్చకులు రాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, మహదేవశర్మ, సుధీర్‌శర్మ, అర్చకులు, రుత్విక్కులు ఉన్నారు.

# కాంగ్రెస్‌లో సమరోత్సాహం

**నకిరేకల్‌లో 'జన'జాతర సభ**

- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు ముఖ్యనేతలు, మంత్రులు హాజరు
- మోదీతో పాటు బీఆర్‌ఎస్ పార్టీపై విమర్శలతో సాగిన ప్రసంగాలు
- దేశ సుస్థిరతకు, పేదల బాగు కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరిన నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జున ఖర్గే, పక్కన అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, వేదికపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు

నకిరేకల్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా నకిరేకల్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జన జాతర బహిరంగ సభకు పార్టీ కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివచ్చారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు జాతీయ, రాష్ట్ర నేతలు, మంత్రులు పాల్గొని క్యాడర్‌లో ఉత్సాహం నింపారు. నకిరేకల్ మినీ స్టేడియం జనంతో నిండిపోయింది. శుక్రవారం సాయంత్రం5 గంటలకు సభ ప్రారంభమైంది. మల్లికార్జున ఖార్గే, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. స్థానిక పటేల్‌నగర్‌లో ఏర్పాటు చేసిన హెలిపాడ్ నుంచి కాన్వాయ్ ద్వారా సభ వేదిక వద్దకు 5.30 గంటలకు చేరుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం అతిథులకు స్వాగతం పలికారు. తొలుత కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. ఖర్గే విజయవాడలో సభకు వెళ్లాల్సి ఉన్నందున.. కిరణ్‌కుమార్‌రెడ్డి తర్వాత ఖార్గే తన ఉపన్యాసం ప్రారంభించారు. దాదాపు 45 నిమిషాల పాటు మాట్లాడిన ఖర్గే.. మోదీ పాలనపై, తెలంగాణలో బీఆర్‌ఎస్‌పై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాల్సిన ఆవశ్యకతను ఆయన పార్టీ శ్రేణులకు, ప్రజలకు వివరించారు. ప్రసంగం ముగిసిన వెంటనే ఖార్గే వేదిక దిగి వెళ్లడంతో ఆయన వెంటే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వీడ్కోలు పలికేందుకు వెళ్లిపోయారు. వారు సభలో మాట్లాడలేదు. ఆ తరువాత సభ గంటన్నర పాటు కొనసాగింది.

**అవకాశం వచ్చింది.. ఆశీర్వదించండి**

సామాన్య కార్యకర్తనైన తనకు కాంగ్రెస్ అధిష్టానం ఎంపీ టికెట్ ఇచ్చిందని, తనను గెలిపించాలని భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. పార్లమెంట్‌కు తనను పంపిస్తే నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని చెప్పారు. బీజేపీ పదేళ్ల అధికారంలో ఉండి తెలంగాణకు మోదీ ఏమీ చేయలేకపోయారని విమర్శించారు.

**నల్ల చట్టాలతో రైతుల ప్రాణాలు తీశారు**

నల్ల ధనం తేకపోగా.. నల్ల చట్టాలతో వేల మంది రైతుల ప్రాణాలను పొట్టనబెట్టుకున్నారని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య దుయ్యబట్టారు. పెట్రోల్ డీజిల్, నిత్యావసర సరుకులు ధరలు పెంచిన మోదీకి ఓటు వేయాలా.. కాంగ్రెస్‌కు ఓటు వేయాలా ప్రజలు ఆలోచన చేయాలన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని కోరారు.



సభలో నినదిస్తున్న మల్లికార్జున ఖర్గే, పక్కన అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**బీజేపీ లేదు, బీఆర్‌ఎస్ లేదు**

తెలంగాణలో బీజేపీలేదు, బీఆర్‌ఎస్ లేదని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నయా నవాబు కేసీఆర్ పోయారని, మోదీకి ప్రజా సమస్యలు తెలియవని అన్నారు. చామల కిరణ్ కుమార్‌రెడ్డి బ్రహ్మాండమైన మెజారిటీతో గెలవబోతున్నారని అన్నారు.

**కరువు పని తెచ్చింది కాంగ్రెస్సే**

ఉపాధి హామీ పని తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని.. నేడు దేశంలో కాంగ్రెస్ అధికారంలో వస్తే బీసీలకు 50 శాతం చట్ట సభల్లో రిజర్వేషన్లు తెస్తానని రాహుల్ గాంధీ ప్రకటించారని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అన్నారు. మళ్లీ దేశంలో బీజేపీ మోదీ పాలన వస్తే పేద ప్రజల బతుకులు ఆగం అవుతాయని, మనకు జీవించే హక్కు కూడా ఉండదన్నారు. భారత రాజ్యాంగం ఉండదన్నారు. ఆకలి అలమటిస్తున్న దేశాలలో మన దేశం ముందు వరుసలోకి పోయిందన్నారు. ఇంకా ఈ సభలో ఏఐసీసీ సెక్రటరీ రోహిత్ చౌదరి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు నేతి విద్యాసాగర్, పూల రవీందర్, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు పూజర్ల శంభయ్య, కొండేటి మల్లయ్య, దైద రవీందర్, చామల శ్రీనివాస్, గాజుల సుకన్య, కందాల పాపిరెడ్డి, చెనగాని దయాకర్, బచ్చుపల్లి గంధర్‌రావు, బోళ్ల వెంకటరెడ్డి, బచ్చుపల్లి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్ పార్టీ చచ్చిపోయింది**

తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీ చచ్చిపోయిందని కాంగ్రెస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. 2018లో 18 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపిస్తే ప్రశ్నించే గొంతుక లేకుండా మా ఎమ్మెల్యేలకు డబ్బులు ఇచ్చి కొనుగోలు చేశారని, ఇందులో నకిరేకల్ పాట్నోడు కూడా ఆనాడు అమ్ముడు పోయాడన్నారు. మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి నిజమైన నాయకుడు కాదని, మందుల సోడా పోసి ఎమ్మెల్యే అయి మంత్రి పదవి తెచ్చుకున్నాడని విమర్శించారు. దేశంలో సుస్థిరపాలనకు కేంద్రంలో కాంగ్రెస్ రావాలన్నారు. పేద ప్రజలు బాగుండాలన్నా కాంగ్రెస్ రావడం అవసరం అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి కుందురు రఘువీర్‌రెడ్డి తెలంగాణలో అత్యధిక మెజారిటీతో గెలవబోతున్నారని, మెజారిటీలో రెండవ స్థానంలో భువనగిరి అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఉండబోతున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడి వెంకట్‌రెడ్డి, ఎంపీలు ఇద్దరు తామంతా పంచపాండవుల్లాగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాలు నాకు రెండు కళ్లలాంటివన్నారు. నకిరేకల్ నియోజకవర్గానికి రూ.100 కోట్ల నిధులు తెప్పిస్తామన్నారు.



నకిరేకల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర బహిరంగ సభకు హాజరైన జనం

## పోలింగ్ సిబ్బందికి ఉచిత రవాణా సౌకర్యం

- కలెక్టర్ వెంకటరావు

సూర్యాపేట: పోలింగ్ విధుల అనంతరం పీఓలు, ఏపీఓలు వారి ప్రాంతాలకు వెళ్లేందుకు ఉచితంగా రవాణా సౌకర్యం ఏర్పాటు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకటరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం సూర్యాపేట కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ హాల్‌లో స్పెషల్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశాం**

లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటరావు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ లోక్‌సభ సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్.ప్రియాంక, బీఎస్ లతతో కలిసి కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో డీపీఆర్వో రమేష్‌కుమార్ ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరావు

**ఆ 48 గంటలు కీలకం**

భానుపురి (సూర్యాపేట): లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో ముందు 48 గంటలు చాలా కీలకమని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి వెంకటరావు, జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు జిల్లాలో మద్యం విక్రయాలు నిలిపివేయాలని పేర్కొన్నారు.

**పోస్టల్ బ్యాలెట్ ఓటేసిన 8,314 మంది**

భానుపురి (సూర్యాపేట): లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఈనెల 3, 4 తేదీలతోపాటు 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నల్లగొండ లోక్‌సభ స్థానం పరిధిలో 7,851 మందికి 7,052 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేశారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకటరావు తెలిపారు. హుజూర్‌నగర్‌లో 1,916 మందికి 1,707 మంది, కోదాడలో 2,629 గాను 2,274 మంది, సూర్యాపేటలో 3,306 మందికి 3,071 మంది వినియోగించుకున్నారని పేర్కొన్నారు. అలాగే భువనగిరి లోక్‌సభ స్థానం పరిధిలో 1,558 మందికి 1,262 మంది ఓటేసినట్టు తెలిపారు. మొత్తంగా రెండు లోక్‌సభ స్థానాల పరిధిలో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో మొత్తం 9,409 మందికి 8,314 మంది ఉద్యోగులు ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాల ద్వారా ఓటేశారని, దీంతో జిల్లాలో 88.36 శాతం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నమోదైందని పేర్కొన్నారు.

## గొప్ప సంఘ సంస్కర్త.. బసవేశ్వరుడు

భానుపురి (సూర్యాపేట): కుల మతాలకు అతీతంగా దేశంలో మొదటి మతాంతర వివాహం జరిపించిన గొప్ప సంఘ సంస్కర్త బసవేశ్వరుడని లింగాయత్ లింగబలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లె శేఖర్ అన్నారు. బసవేశ్వరుడి 891వ జయంతి సందర్భంగా శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో సూర్యాపేటలోని మినీట్యాంక్ బండ్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేటలో లింగాయత్ లింగబలిజ సంఘ భవనం కోసం ప్రభుత్వం భూమిని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లింగాయత్ లింగ బలిజ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వల్లెం ఉమామహేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి సంకుర్తు శెట్టి పరమేష్, కోశాధికారి అల్లం వీరయ్య, మహిళా అధ్యక్షురాలు సూర సోమేశ్వరమ్మ, ఉపాధ్యక్షురాలు తొగరు ఉప్పమ్మ, కోశాధికారి దొడ్డి రాధిక, దొడ్డ నాగలక్ష్మి, శెట్టి శోభ, జిల్లా మీడియా ఇన్‌చార్జి బత్తుల మల్లికార్జున్, వల్లెం శంకరప్రసాద్, దొడ్డి ఈశ్వరయ్య, బాల్గాని కోటయ్య పాల్గొన్నారు.



బసవేశ్వరుని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

# ప్రచారానికి నేటితో తెర

- ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాల్లో నేతలు
- జాతీయ స్థాయి నాయకుల ప్రచారాలతో బిజీబిజీ
- పోల్ మేనేజ్‌మెంట్‌పై పార్టీల దృష్టి



సూర్యాపేటలో కాంగ్రెస్ శ్రేణుల ప్రచార ర్యాలీ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : పార్లమెంట్ ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం 5 గంటలకు బంద్ కానుంది. ఇప్పటి వరకు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ సమావేశాలు, కార్నర్ మీటింగ్‌లను పెద్ద ఎత్తున నిర్వహించగా, వారం రోజులుగా ఇంటింటి ప్రచారం చేపట్టాయి. కాంగ్రెస్, బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకులు బహిరంగ సభల్లో పాల్గొనగా బీఆర్‌ఎస్‌కు సంబంధించి ఆ పార్టీ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సభల్లో పాల్గొన్నారు. శనివారం చివరి రోజు కావడంతో పొద్దంగా ఇంటింటి ప్రచారంతోపాటు ర్యాలీలు, సభలకు ప్లాన్ చేశారు. మరో వైపు ఆ తరువాత 48 గంటల్లో ఎలా ముందుకు సాగాలి.. పోల్ మేనేజ్‌మెంట్ ఎలా చేయాలన్న విషయంపై దృష్టి సారిస్తున్నారు.

**48 గంటలపాటు సైలెంట్ పీరియడ్**

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ఈ నెల 13న జరుగనుంది. పోలింగ్‌కు 48 గంటలు ముందుగానే ప్రచారం ముగించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు సభలు, సమావేశాలు, ర్యాలీలు, రోడ్డుషోలు, బహిరంగ సభలతో హోరెత్తగా.. సాయంత్రం నుంచి మైక్‌లన్నీ మూగబోనున్నాయి. ఈ 48 గంటలపాటు సైలెంట్ పీరియడ్‌గా కొనసాగనుంది. ప్రచారాలు నిర్వహించకుండా, అభ్యర్థి మాత్రమే తిరిగే అవకాశం ఉంది. దీంతో శనివారం సాయంత్రం వరకు ఇంటింటి ప్రచారం నిర్వహించి.. ఆ తరువాత ఓటర్లను ఆకట్టుకునేందుకు పార్టీలు ఎత్తులు వేస్తున్నాయి. నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో శుక్రవారం ప్రధాన పార్టీల అభ్యర్థులు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలు ఇంటింటి ప్రచారం చేపట్టారు.

**సభలు, సమావేశాలకే ప్రాధాన్యం**

ఈ ఎన్నికల్లో అన్ని ప్రధాన పార్టీలు సభలు, సమావేశాలు, కార్నర్ మీటింగ్‌లకే ప్రాధాన్యం ఇచ్చాయి. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే క్షేత్రస్థాయిలో ఇంటింటి ప్రచారం తక్కువే జరిగింది. కొన్ని గ్రామాల్లో అయితే అభ్యర్థుల తరఫున పెద్దగా ప్రచారం నిర్వహించిన దాఖలాలు లేవు. మండల కేంద్రాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న సమావేశాలకు ఎంపీ అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు వచ్చినప్పుడు పెద్ద ఎత్తున తరలివచ్చిన పార్టీ శ్రేణులు ఆ తరువాత బూత్ స్థాయిలో పెద్దగా ప్రచారం చేయలేదనే చెప్పొచ్చు.



## అమెరికా క్రికెట్ బోర్డు చైర్మన్‌గా అల్వాల వాసి

- జూన్‌లో జరిగే టీ20 ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న అమెరికా
- పిసికె వేణుకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న వరల్డ్‌కప్

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : అమెరికా దేశ క్రికెట్ బోర్డ్ చైర్మన్‌గా నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం, అల్వాల గ్రామానికి చెందిన పిసికె వేణుకుమార్‌రెడ్డి కొనసాగుతున్నారు. పిసికె కొండల్‌రెడ్డి, లక్ష్మీ దంపతులకు కుమార్తె వనజ, కుమారుడు వేణుకుమార్‌రెడ్డి ఉన్నారు. కొండల్‌రెడ్డి పశుసంవర్థక శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. వనజ ప్రభుత్వ టీచర్‌గా విధులు నిర్వస్తుండగా, వేణుకుమార్‌రెడ్డి 20 ఏళ్ల క్రితం అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు.

**వరల్డ్‌కప్‌కు అర్హత సాధించడంలో కీలక పాత్ర**

జూన్ 1 నుంచి ప్రారంభం కానున్న టీ20 వరల్డ్‌కప్‌కు వెస్టిండీస్‌తో పాటు అమెరికా దేశం కూడా ఆతిథ్యం ఇస్తోంది. అమెరికాలోని మూడు వేదికల్లో ఆ దేశ క్రికెట్ బోర్డు చైర్మన్‌గా ఉన్న నలగొండ వాసి వేణుకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలోనే మ్యాచ్‌లు జరగనున్నాయి. విశేషమేమిటంటే.. వేణుకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అమెరికా క్రికెట్ జట్టు ఈసారి వరల్డ్‌కప్‌కు అర్హత సాధించింది. యూఎస్‌ఏలో గతంలో ఉన్న క్రికెట్ పాలకవర్గం పాలనా సమస్యల కారణంగా ఐసీసీచే సస్పెండ్ చేయబడింది. ప్రస్తుత పాలకవర్గానికి 2019లో గుర్తింపు లభించడంలో అప్పుడు ఆ దేశ డైరెక్టర్‌గా ఉన్న పిసికె వేణుకుమార్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారు. వేణుకుమార్‌రెడ్డి అనేక సవాళ్లను ఎదుర్కొని అమెరికాకు క్రికెట్ బోర్డ్ చైర్మన్‌గా వ్యవహరిస్తుండడం, టీ 20 వరల్డ్ కప్ ఆయన ఆధ్వర్యంలో జరగడం తెలుగువారికి దక్కిన గౌరంగా చెప్పవచ్చు.



పిసికె వేణుకుమార్‌రెడ్డి

## 'ఎంజీయూ' కోర్సుల్లో సీట్లు పెంపు

- వీసీ గోపాల్‌రెడ్డి



సెనెట్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న వీసీ గోపాల్‌రెడ్డి

నల్లగొండ రూరల్ : మహాత్మా గాంధీ యూనివర్సిటీలో వివిధ కోర్సుల్లో సీట్లు పెంచుతున్నట్లు వీసీ గోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం యూనివర్సిటీలో నిర్వహించిన అకాడమిక్ సెనెట్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పీజీ, ఇంజనీరింగ్, పీహెచ్‌డీలో సీట్ల పెంపును సెనెట్ కమిటీ ఆమోదించిందని తెలిపారు. నూతన విద్యా సంవత్సరంలో కోర్సులు, సిలబస్‌లో మార్పులను ఆమోదించిందని.. భవిష్యత్ సామాజిక అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మారుతున్న సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ విద్యా ప్రమాణాలు పాటిస్తూ ముందుకు సాగాలన్నారు. సమావేశంలో మాజీ వీసీ గంగాధర్, మాజీ రిజిస్ట్రార్లు నరేందర్ రెడ్డి, యాదగిరి, రవి, ఓఎస్‌డీ అంజిరెడ్డి, ఐక్యూ డైరెక్టర్ రమేష్, కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎంవీఎస్ రెడ్డి, ప్రేమ్‌సాగర్, అరుణ ప్రియ, ఉపేందర్‌రెడ్డి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ అభ్యర్థులదే గెలుపు



సూర్యాపేట మండలం టేకుమట్లలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న జగదీష్‌రెడ్డి తదితరులు

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేట: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భువనగిరి, నలగొండ పార్లమెంట్ స్థానాల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు ఖాయమని, కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట మండలం టేకుమట్ల గ్రామంలో బీఆర్‌ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రచారంలో మాకు వస్తున్న అపూర్వ ప్రజాస్పందనే బీఆర్‌ఎస్ గెలుపునకు నిదర్శనమని సూచించారు. తమ ఓటమి ఖాయం అయిందని భావించే కాంగ్రెస్ నాయకులు. పోలీసులను ఉపయోగించి బీఆర్‌ఎస్ శ్రేణులను భయపెడుతున్నారన్నారు. జానారెడ్డి, ఉత్తమ్, కోమటిరెడ్డి బ్రదర్స్‌తో పాటు ఇతర కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ నేతల ఇళ్లకు వెళ్లి బెదిరించడం దుర్మార్గం అన్నారు. కాంగ్రెస్ నాలుగు నెలల పాలనలోనే నరకం చూశామని ప్రజలే మాకు స్వయంగా చెబుతున్నారన్నారు. మే 13వ తేదీన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రైతుబంధు పేరుతో కాంగ్రెస్ పార్టీ ఆడుతున్న నాటకాలను రైతాంగం గ్రహించారన్నారు. తెలంగాణలో సబ్బండ వర్గాలు కేసీఆర్‌తోనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నకిరేకల్‌లో కాంగ్రెస్‌ 'జనజాతర'


నకిరేకల్‌లో నిర్వహించిన బహిరంగ సభలో అభివాదం చేస్తున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి


కాంగ్రెస్‌ సేవాదళ్‌ కార్యకర్తల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న మల్లికార్జున ఖర్గే


ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం


ఖర్గేకు బుద్ధుడి విగ్రహం బహూకరిస్తున్న మంత్రి పొంగులేటి

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

## సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాల పరిశీలన

నార్కట్‌పల్లి: మండలంలోని గోపలాయిపల్లిలో గ్రామంలో సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాన్ని ఎన్నికల పరిశీలకుడు నవీన్‌షైనీ శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా పోలింగ్‌ ఏర్పాట్ల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 13వ తేదీన పోలింగ్‌ ప్రశాంత వాతవరణంలో జరిగేలా సంబంధిత అధికారులు చూడాలన్నారు. అధికారులు పారదర్శకంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఆయన వెంట నార్కట్‌పల్లి ఎస్‌ఐ అంతిరెడ్డి తదితరులున్నారు.


పోలింగ్‌ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు

## పకడ్బందీగా నిర్వహించాలి

భువనగిరిటౌన్‌ : పార్లమెంట్‌ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌ సూచించారు. శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈనెల 13న జరగనున్న పోలింగ్‌ కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లు, పోస్టల్‌ బ్యాలెట్‌, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్‌, రిసెప్షన్‌ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఈవీఎం యంత్రాల తరలింపు, కౌంటింగ్‌ ఏర్పాట్లు తదితర అంశాలపై కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ హనుమంతు కే.జెండగే, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్‌ పి.బెన్‌ షాలోమ్‌, రెవెన్యూ డివిజనల్‌ అధికారులు అమరేందర్‌, శేఖర్‌రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్‌ నాగేశ్వర చారి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌కు అంతరాయం కలగొద్దు


మాట్లాడుతున్న విద్యుత్‌ శాఖ సీజీఎం, ఎన్నికల ప్రత్యేక నోడల్‌ అధికారి చక్రపాణి

హుజూర్‌నగర్‌: ఎన్నికల ప్రక్రియలో విద్యుత్‌కు అంతరాయం కలగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యుత్‌ శాఖ సీజీఎం, ఎన్నికల ప్రత్యేక నోడల్‌ అధికారి చక్రపాణి సూచించారు. శుక్రవారం హుజూర్‌నగర్‌ పట్టణంలో డివిజన్‌ విద్యుత్‌ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో విద్యుత్‌ ఎస్‌ఈ పాల్‌రాజ్‌, డీఈ వెంకట కిష్టయ్య, ఏడీఈలు సక్రూనాయక్‌, వినోద్‌, వెంకన్న, డివిజన్‌లోని ఏఈలు పాల్గొన్నారు.

# దేశం దృష్టిని ఆకర్షించిన మాస్‌ నామినేషన్లు

### సాగునీరు, ఫ్లోరైడ్‌ కష్టాలను దేశానికి చాటిన నల్లగొండ ప్రజలు

- జల సాధన కోసం ఉద్యమించిన పల్లెలు
- 1996 పార్లమెంటు ఎన్నికల్లో 682 మంది నామినేషన్లు
- ఎన్నికల బరిలో నిలిచిన 480 మంది
- బ్యాలెట్‌ పేపర్‌ ప్రింటింగ్‌ కోసం నెల రోజులు ఎన్నికలు వాయిదా
- బుక్‌లెట్‌ మాదిరిగా బ్యాలెట్‌ పేపర్‌
- ఈ ఎన్నికల తర్వాత పెరిగిన నామినేషన్ల డిపాజిట్‌ సొమ్ము



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఒకప్పుడు ఫ్లోరైడ్‌ పీడతో అల్లాడిన నల్లగొండ జిల్లా.. నాటి ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా రాజకీయ పార్టీలను ఉలిక్కిపడేలా చేసింది. సాగునీరు లేక అల్లాడిన రైతులు.. రక్షిత తాగునీరు లేక ఎండిన గొంతులు.. ఫ్లోరైడ్‌ విషపు నీటితో బతుకులను కోల్పోయిన బాధితులంతా బ్యాలెట్‌ యుద్ధంలోకి దిగారు. నల్లగొండ జిల్లాకు జరిగిన జల వివక్షను దేశానికి చాటేందుకు పార్లమెంట్‌ ఎన్నికలను తమ జల పోరాటానికి వేదికగా మార్చుకున్నారు. సాగునీటి సాధన కోసం, ఫ్లోరోడ్‌శాపం విముక్తి కోసం జల సాధన సమితి ఆధ్వర్యంలో పోస్టు కార్డు ఉద్యమాలు, మనీ ఆర్డర్లు, పాదయాత్రలు... ఇలా ఎన్నో రూపాల్లో పోరాటాలు చేసిన నల్లగొండ జిల్లా ప్రజలు 1996 పార్లమెంట్‌ ఎన్నికల్లో మాస్‌ నామినేషన్లతో దేశంలోనే చరిత్ర సృష్టించారు.

**సమస్యను దేశవ్యాప్తంగా తెలియజేసేందుకే..**

సాగునీటి సమస్య పరిష్కారం కోసం, ఫ్లోరైడ్‌ భూతాన్ని తరిమికొట్టడమే లక్ష్యంగా సాగుతున్న జల సాధన సమితి ఉద్యమానికి పార్లమెంటు ఎన్నికలు అనుకోని అవకాశంగా కలిసి వచ్చాయి. వాటితో సహా 20 డిమాండ్లతో జల సాధన సమితి వ్యవస్థాపకుడు దుశ్చర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో మాస్‌ నామినేషన్లు వేయాలన్న నిర్ణయానికి వచ్చారు. వాస్తవానికి 1994లోనే మాస్‌ నామినేషన్లు వేస్తామని ప్రకటించినా, తాత్కాలికంగా అప్పట్లో ఆ నిర్ణయాన్ని వాయిదా వేశారు. 1996 ఎన్నికలు మాస్‌ నామినేషన్లకు వేదికగా మారాయి. అందులో భాగంగా నల్లగొండ పార్లమెంట్‌ నియోజకవర్గానికి జల సాధన సమితి నేతృత్వంలో స్వతంత్ర అభ్యర్థులుగా పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు చేయనున్నామని అప్పటి జిల్లా కలెక్టర్‌ నీలం సహానికి ముందస్తుగానే తెలియజేసి నోటీసు ఇచ్చారు. అప్పటి ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌ టి.ఎన్‌.శేషన్‌, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇలా ప్రతీ ఒక్కరి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. అప్పట్లో నామినేషన్‌ డిపాజిట్‌ ఫీజు రూ.1000 లోపే ఉండడం కూడా ఉద్యమకారులకు కలిసి వచ్చింది. ఆ ఎన్నికల్లో ఏకంగా 682 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఉద్యమకారులు, రైతులు, ఫ్లోరైడ్‌ బాధితులు, మహిళలు, వృద్ధులు.. ఇలా అన్ని వర్గాల వారూ నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన తర్వాత 480 మంది బరిలో మిగిలారు. అందులో ఏడుగురు మాత్రమే ఏడు పార్టీల తరపున పోటీలో ఉండగా, మిగతా వారంతా స్వతంత్ర అభ్యర్థులే. జలసాధన కోసం ఉద్యమించి నామినేషన్లు వేసిన వారే. ఆ ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన సీపీఐ నుంచి బొమ్మగాని ధర్మభిక్షం, బీజేపీ నుంచి నల్లు ఇంద్రసేనారెడ్డి, కాంగ్రెస్‌ నుంచి తిరునగరి గంగాధర్‌, మరో నలుగురు ఇతర పార్టీల వారు ఉన్నారు. మాస్‌ నామినేషన్లు వేయడంతో నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గానికి 1996 ఏప్రిల్‌లో జరుగాల్సిన ఎన్నికల నెల రోజుల పాటు వాయిదా పడ్డాయి. అంతమంది అభ్యర్థులతో బ్యాలెట్‌ పేపర్‌ తయారు చేయడానికి అంత సమయం పట్టిందని అప్పటి నాయకులు చెబుతుంటారు. నాటి బ్యాలెట్‌ పేపర్‌ ఏకంగా ఒక పుస్తకమే అయ్యిందని పేర్కొంటున్నారు. ఆ తరువాత మే నెలలో జరిగిన ఆ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి బొమ్మగాని ధర్మభిక్షం ఎంపీగా గెలిచారు.

### ప్రభావం చూపిన మాస్‌ నామినేషన్ల వ్యూహం

మాస్‌ నామినేషన్ల వ్యూహం అప్పటితోనే ఆగిపోలేదు. ప్రతి ఎన్నికల్లో ఎక్కడో ఒక చోట ఈ వ్యూహాన్ని అమలు చేస్తున్న సందర్భాలు వెలుగులోకి వస్తున్నాయి. 2019 పసుపు రైతులు ఇదే వ్యూహాన్ని అనుసరించారు. నిజామాబాద్‌ ఎంపీ స్థానానికి పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు చేశారు. పోటీలో 185 మంది నిలిచారు. 1996 నాటి మాస్‌ నామినేషన్లపై దేశంలోని పలువురు నాయకులు అప్పట్లో స్పందించారు. వారిలో ఒకరు బాల్‌థాకరే. అయితే, సామాన్యులు తమ సమస్యలను దేశం దృష్టికి తీసుకెళ్లాలనే ఈ నామినేషన్లు వేశారనే పూర్వపరాలు తెలియని ఆయన 'పుట్టగొడుగులెక్క పార్టీలు పుడుతున్నాయి.. అందుకే ఇన్ని నామినేషన్లు..' అని వ్యాఖ్యానించినట్లు అప్పటి నేతలు చెబుతున్నారు. మాస్‌ నామినేషన్ల వ్యూహకర్త, జలసాధన సమితి స్థాపకుడు దుశ్చర్ల సత్యనారాయణ అప్పటి పరిణామాలపై మాట్లాడుతూ 'ఆ ఎన్నికల్లో పది వేల నామినేషన్లు వేయించాలనుకున్నాం.. కనీసం వెయ్యి నామినేషన్లు వేస్తామనుకున్నాం. కానీ చివరకు 682 నామినేషన్లు మాత్రమే వేయగలిగాం' అని పేర్కొన్నారు.

# మద్యం అక్రమ రవాణాపై కొరడా

- భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో రూ.4.53కోట్ల విలువైన మద్యం సీజ్‌
- 1,214 కేసులు నమోదు
- 216 మంది అరెస్ట్‌


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ శ్రీగ్గం సైదులు

సాక్షి, యాదాద్రి: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భువనగిరి పార్లమెంట్‌ నియోజకవర్గ పరిధిలో ఎక్సైజ్‌, పోలీసు శాఖ మద్యం అక్రమ రవాణా, గంజాయి, నగదు తరలింపుపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఆలేరు, భువనగిరి, తుంగుతుర్తి, నకిరేకల్‌, మునుగోడు, ఇబ్రహీంపట్నం, జనగామ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎక్సైజ్‌ అధికారులు పలు చోట్ల జాతీయ, రాష్ట్రీయ రహదారుల వెంట చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మరికొన్ని ప్రాంతాల్లో ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టారు. మార్చి 16నుంచి మే 9వరకు నిర్వహించిన తనిఖీల్లో రూ.4.53కోట్ల విలువ గల 2,49,331లీటర్ల మద్యాన్ని సీజ్‌ చేశారు. తనిఖీల్లో 1,214 కేసులు నమోదు చేసి 216మందిని అరెస్ట్‌ చేశారు. బెల్టు దుకాణాల్లో మద్యం విక్రయిస్తున్న నలుగురికి రూ.2లక్షల జరిమానా విధించారు.

**భువనగిరి పరిధిలో పట్టుబడిన మద్యం**

| అసెంబ్లీసెగ్మెంట్‌ | మద్యం (లీటర్లలో) | నమోదైన కేసులు | అరెస్టైన వ్యక్తులు |
|---|---|---|---|
| ఇబ్రహీంపట్నం | 7,270 | 74 | 31 |
| మునుగోడు | 50,503 | 255 | 27 |
| భువనగిరి | 52,984 | 162 | 16 |
| నకిరేకల్‌ | 31,519 | 109 | 18 |
| తుంగతుర్తి | 28,121 | 194 | 57 |
| ఆలేరు | 45,822 | 223 | 19 |
| జనగామ | 33,110 | 197 | 48 |

## పోలింగ్‌ పూర్తయ్యే వరకు మద్యం దుకాణాలు బంద్‌

భువనగిరి, ఆలేరు, రామన్నపేట, మోత్కూరు ఎక్సైజ్‌ పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్‌ఐలతో శుక్రవారం భువనగిరిలోని ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ కార్యాలయంలో జిల్లా ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ శ్రీగ్గం సైదులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్‌ ఆదేశాల మేరకు ఈనెల 11న సాయంత్రం నుంచి 13వ తేదీన పోలింగ్‌ పూర్తి అయ్యే వరకు మద్యం దుకాణాలు, బార్‌లు బంద్‌ ఉంటాయని తెలిపారు. పోలింగ్‌ సందర్భంగా ఎక్కడైనా మద్యం విక్రయించినట్లు, రవాణా చేసినట్లు తెలిస్తే 87126 58939నంబర్‌కు సమాచారం అందించాలని చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో 581 కేసులు నమోదు చేసి 57మందిని అరెస్ట్‌ చేశామని, రూ.కోటి 97లక్షల 28వేల విలువ చేసే 1,49,318 లీటర్ల మద్యాన్ని సీజ్‌ చేశామని, అదే విధంగా భువనగిరి, యాదగిరిగుట్టలో రెండు గంజాయి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

# కాంగ్రెస్‌ అభ్యర్థి రఘువీర్‌రెడ్డికే మా మద్దతు


ప్రత్యేక ప్రార్థన చేస్తున్న ముస్లిం మత పెద్దలు, చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి, ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి

- జమైత్‌ ఏ ఉలేమా అధ్యక్షుడు మౌలానా ఎహసానుద్దీన్‌ ఖాస్మీ

నల్లగొండ: పార్లమెంట్‌ ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డికి మద్దతు ప్రకటిస్తున్నట్లు జమైత్‌ ఏ ఉలేమా అధ్యక్షుడు మౌలానా ఎహసానుద్దీన్‌ ఖాస్మీ ప్రకటించారు. గురువారం రాత్రి దారుల్‌ ఉలూమ్‌ నల్లగొండలో జమైత్‌ ఉలేమాగువులు, ముస్లిం పెద్దలతో రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈసందర్భంగా ముస్లిం మతపెద్దలు మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్‌ పార్టీకి మద్దతు ఇస్తున్నట్లు తీర్మానం చేశామని పేర్కొన్నారు. ఈమేరకు మంత్రి కోమటిరెడ్డి, ఎంపీ అభ్యర్థి రఘువీర్‌ రెడ్డిలు వారికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్‌ శంకర్‌ నాయక్‌, మున్సిపల్‌ చైర్మన్‌ బుర్రి శ్రీనివాస్‌ రెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌ రెడ్డి, ఎంఏ హఫీజ్‌ ఖాన్‌, యూత్‌ కాంగ్రెస్‌ నాయకులు ముజ్జు, మత గురువులు మఫ్తీ సిద్దిక్‌, అహ్మద్‌, మౌలానా అక్బర్‌ ఖాన్‌, మౌలానా యాసిర్‌, మౌలానా ఆబిద్‌ అంజుమ్రషాదీ, మౌలానా జుబేర్‌, హఫీజ్‌ అతిక్‌, హఫీజ్‌ యూనిస్‌, మున్సిపల్‌ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ముగిసిన పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటింగ్‌

భువనగిరిటౌన్‌ : పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటింగ్‌ శనివారం ముగిసింది. ఎన్నికల సంఘం రెండు రోజులు గడువు పొడిగించినా పూర్తిస్థాయిలో ఓటు హక్కు వినియోగించుకోలేదు. భువనగిరి లోక్‌సభ పరిధిలో పోస్టల్‌ బ్యాలెట్‌ కోసం 13,213 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. 10వ తేదీ వరకు సమయం పొడిగించినా 10,468 మందే ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2,020 మంది దూరంగా ఉన్నారు.



# రాజగోపాల్‌ మంత్రి అయితే కాంగ్రెస్‌ ఖతం

- బీఆర్‌ఎస్‌ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌


రోడ్డు షోలో మాట్లాడుతున్న క్యామ మల్లేష్‌

మోత్కూరు: కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మంత్రి అయితే కాంగ్రెస్‌ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని భువనగిరి బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌ ఆరోపించారు. శుక్రవారం మోత్కూరు మున్సిపల్‌ కేంద్రంలోని రామలింగేశ్వర స్వామి ఆలయం నుంచి చెరువు కట్ట, పాత బస్టాండ్‌ మీదుగా అంబేద్కర్‌ చౌరస్తా వరకు ఎన్నికల ప్రచార రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా క్యామ మల్లేషం మాట్లాడుతూ.. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి ఆవేశపరులని, పార్టీలో ఏకపక్షంగా వ్యవహరిస్తారన్నారు. బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్‌ నిలకడ లేని వ్యక్తి అని, గతంలో ఎంపీగా చేసింది శూన్యమని విమర్శించారు. బీఆర్‌ఎస్‌ ఎంపీ స్థానాన్ని గెలిపించుకుంటే స్థానిక సంస్థల్లో బలోపేతం అవుతామన్నారు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌ మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏమరపాటుతో చేసిన పొరపాటును ప్రజలు గుర్తిస్తున్నారని, పార్లమెంట్‌ ఎన్నికల్లో అలాంటిది పునరావృతం కాకుండా అప్రమత్తం కావాలన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్‌, యాదాద్రి భువనగిరి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్‌ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్‌, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర రెడ్డి, అడ్డగూడూరు జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీరాముల జ్యోతి, వైస్‌ ఎంపీపీ బుషిపాక లక్ష్మి, మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌లు టి.మేఘారెడ్డి, కె.యాకూబ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పొన్నబోయిన రమేష్‌, కార్యదర్శి గిరగాని శ్రీను, పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జంగ శ్రీను, గజ్జి మల్లేష్‌, సింగిల్‌విండో చైర్మన్‌ కంచర్ల అశోక్‌రెడ్డి, నాయకులు మర్రి అనిల్‌, దబ్బెటి శైలజ, కట్టా ఇంద్రజ్యోతి, మల్లం అనిత, దాసరి తిరుమలేష్‌, నాగయ్య, కొండా సోమల్లు తదితరులు పాల్గొన్నారు.

# 'వెంకటయ్య.. ఎన్నిసార్లు కండువా కప్పాలయ్యా'

- మూడు సార్లు పార్టీ మారిన చిన్నాల వెంకటయ్యను ఉద్దేశించి చమత్కరించిన జానారెడ్డి


జానారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు (ఇన్‌సెట్‌లో వెంకటయ్య)

నిడమనూరు : మండలంలోని శాఖాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌లు ఇరుగుల వెంకటరెడ్డి, బొజ్జ పరిమళ, చిన్నాల సుజాతవెంకటయ్య, మాజీ ఎంపీటీసీ మద్ది బజారయ్య తోపాటు మరికొందరు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి సమక్షంలో శుక్రవారం స్థానికంగా కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. వీరిలో మాజీ సర్పంచ్‌ చిన్నాల సుజాతవెంకటయ్య యాదవ్‌కు కాంగ్రెస్‌ కండువా కప్పే సమయంలో ×ఇప్పటికే మూడు సార్లు కప్పించుకున్నావ్‌. మళ్లీ పార్టీ మారావు, ఇంకా ఎన్నిసార్లు కండువా కప్పించుకుంటావ్‌ వెంకటయ్యా?.. అంటూ జానారెడ్డి చమత్కరించారు. దీంతో అక్కడ నవ్వులు విరబూసాయి. ఇదిలా ఉండగా.. నకిరేకల్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ ఉండడంతో మిగతా వారికి పార్టీ కండువాలు కప్పమని జానారెడ్డి యడవెల్లి రంగశాయిరెడ్డికి చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు. జైవీర్‌ రెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేసిన సమయంలో కాంగ్రెస్‌లోకి ఎవరూ రాలేదని, పార్టీ అధికారంలోకి రాగానే.. అందరూ వస్తున్నారని వారికి కండువాలు కప్పకుండానే రంగశాయిరెడ్డి వెళ్లిపోయారు. దీంతో మిగతా వారికి కాంగ్రెస్‌ నాయకుడు మేరెడ్డి వెంకట్‌రాహుల్‌, అంకతి సత్యంలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## ఆకట్టుకున్న భక్తి సంగీతం


భక్తి సంగీతం నిర్వహిస్తున్న కళాకారులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ సన్నిధిలోని నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. భక్తులను ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదపరిచే విధంగా ఇటీవల ఆలయ ఈఓ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ప్రతి శుక్ర, శనివారాల్లో సాంస్కృతిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే శుక్రవారం సాయంత్రం ఆలయ మాఢవీధిలో ఎస్‌ఆర్‌ మ్యూజిక్‌ అండ్‌ డ్యాన్స్‌ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తిసంగీతం భక్తులను ఆకట్టుకుంది.

# బీజేపీ పాలనలో దేశం రావణ కాష్టం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం


సభలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

సంస్థాన్‌ నారాయణపురం: బీజేపీ పాలనలో దేశం రావణ కాష్టంలా మండిపోతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సంస్థాన్‌ నారాయణపురం మండలంలోని పుట్టపాక గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. మోదీ మళ్లీ గెలిస్తే దేశం సర్వనాశనం అవుతుందన్నారు. రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న బీజేపీని ఎన్నికల్లో బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక 20 కోట్ల ఉద్యోగాలు ఊడిపోయాయన్నారు. రైతుల ఆదాయం పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ, గిట్టుబాటు ధరకు అడిగినందుకు 765 మంది రైతులను కాల్చి చంపిందని విమర్శించారు. సభలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సైకిలాబ్‌, దోనూరి నర్సిరెడ్డి, మర్రి వసంత, దోడ యాదవరెడ్డి, జీ.శ్రీనివాసాచారి, దొంతగోని పెద్దులు, రాములు, అమరేందర్‌, ఉప్పలపెల్లి బాలకృష్ణ తదితరులున్నారు.

# దేశంలో కాంగ్రెస్‌ గెలుపు చారిత్రక అవసరం

- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ ప్రధాన సమాచార మాజీ కమిషనర్‌ డాక్టర్‌ వర్రె వెంకటేశ్వర్లు


సమావేశంలో మాట్లాడుతున్న వర్రె వెంకటేశ్వర్లు

నాగారం : దేశంలో కాంగ్రెస్‌ గెలుపు చారిత్రక అవసరమని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ ప్రధాన సమాచార మాజీ కమిషనర్‌ డాక్టర్‌ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో తుంగతుర్తి నియోజకవర్గ స్థాయి సమాచార హక్కు చట్టంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్‌ ఎన్నికల్లో విద్యావంతులు, మేధావులు కాంగ్రెస్‌ పక్షాన నిలబడి భువనగిరి పార్లమెంట్‌ కాంగ్రెస్‌ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కేంద్రంలో రాహుల్‌ గాంధీని ప్రధానిని చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీల తరహాలో, కేంద్రంలో రాహుల్‌గాంధీ ఐదు న్యాయ సూత్రాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో సమాచార హక్కు వికాస సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గుంటకండ్ల ముకుందరెడ్డి, సమాచార హక్కు వికాస సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కాచం సత్యనారాయణ, సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రమాద కృష్ణారెడ్డి, యాదాద్రి జిల్లా అధ్యక్షుడు ఖుర్షీద్‌పాషా, మహిళ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు యర్రమాద హేమలత, సత్యనారాయణ, పాశం యాదవరెడ్డి, పూలమ్మ, వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రామ్మూర్తి, యాదగిరి, అంజయ్య, శ్రీధర్‌, తదితరులు పాల్గొన్నారు.